ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
బుధవారం 7 ఆగస్టు 2024



'ఉపాధి'పై అనుమానాలు!

MAHATMA GANDHI NATIONAL RURAL EMPLOYMENT GUARANTEE SCHEME

లక్ష్యాలకు మించి..



మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు పని దినాలు కల్పించే విషయంలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆరోస్థానంలో నిలవగా మహబూబాబాద్ జిల్లా అట్టడుగున 31వ స్థానంలో ఉంది. జనగామ జిల్లాలో 2022-23 సంవత్సరంలో 24.8లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా దానిని మించి 30.5 లక్షల పని దినాలను (123శాతం) పని దినాలను కల్పించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాలో 17.5 లక్షల పని దినాలను కల్పన లక్ష్యంకాగా అంతకు మించి 20.3 లక్షల (116 శాతం) కల్పించి రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా పనిదినాల లక్ష్యం 19.3లక్షలు కాగా 21.9లక్షల పని దినాలు (114 శాతం) కల్పించడంతో 17వ స్థానం, ములుగు జిల్లాలో 12.1లక్షల పని దినాలు లక్ష్యం కాగా 13.4లక్షల పని దినాలు (111 శాతం) కల్పించడంతో 24వ స్థానంలో నిలిచింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా 19.9లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా 21.2లక్షల పని దినాలతో (106 శాతం) 29వస్థానంలో మహబూబాబాద్ జిల్లా 53.3లక్షల పని దినాలు లక్ష్యం కాగా 55.9 (105 శాతం) పని దినాలతో రాష్ట్ర స్థాయిలో అట్టడుగున 31వ స్థానంలో నిలిచింది.

- లక్ష్యాన్ని మించి పనులు కల్పించడం పట్ల సందేహాలు
- తనిఖీలకు ప్రత్యేక కేంద్ర బృందాల ఏర్పాటు
- త్వరలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఉమ్మడి జిల్లాకు రాక
- రికార్డులను సిద్ధం చేస్తున్న డీఆర్‌డీవో అధికారులు

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం తీరుతెన్నులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు రికార్డుల్లో చూపిన మేరకు వాస్తవంగానే ఉపాధి పనులు జరిగాయా? హాజరైన కూలీల సంఖ్య సక్రమంగానే ఉందా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అనుమానాలకు చెక్‌పెట్టేలా కేంద్రం క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలకు శ్రీకారం చుడుతోంది. ఇందుకోసం కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులో చూపిన మేరకు ఉపాధి లెక్కలు సక్రమంగా ఉన్నాయా? ఏవైనా అవకతవకలు ఉన్నాయా? అంశాలపై నిగ్గుతేల్చనున్నాయి. ఇందులో భాగంగా ఆ బృందంలోని అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించడంతో పాటు అవసరమైతే కూలీలతో నేరుగా మాట్లాడతారు. త్వరలోనే కేంద్ర బృందాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కూడా పర్యటించనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రికార్డులను సిద్ధం చేస్తున్నారు.

గణాంకాల పెరుగుదలతో అనుమానాలు

జాతీయ ఉపాధి హామీ పథకంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని 18 జిల్లాల్లో కూలీల సంఖ్య, పనిదినాలు 150శాతానికి పైగా పెరిగినట్టు గణాంకాలు వెలుగు చూడడంతో పనుల కల్పన, కూలీల హాజరుపై కేంద్ర ప్రభుత్వానికి అనుమానం కలిగింది. క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించి నిగ్గుతేల్చాలని నిర్ణయించింది. ఈ మేరకు పనులను పరిశీలించడానికి కేంద్ర బృందాలను పంపుతోంది. పని దినాల కల్పన విషయంలో కేంద్రానికి అనుమానం కలిగిన రాష్ట్రంలోని 18 జిల్లాల్లో ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆరు జిల్లాల్లో పనులు, కూలీలకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం 2022-23 సంవత్సరంలో జరిగిన పని దినాలతో 2023-24 సంవత్సరంలో జరిగిన పనిదినాలను పోల్చి చూసింది. 2022-23లో ఉపాధి పని దినాలు 2023-24 కన్నా తక్కువగా ఉండడంతో అనుమానం పడుతోంది. ఇటీవల అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సభకు రాష్ట ప్రభుత్వం సమర్పించిన 2024 సామాజిక, ఆర్థిక సర్వే రిపోర్టులో కూడా రాష్ట్రంలో 18 జిల్లాల్లో లక్ష్యానికి మించి పని దినాలు కల్పించినట్టు పేర్కొన్నది.

రికార్డులను సిద్ధం చేస్తున్న అధికారులు

కూలీల పని దినాలు పెరగడానికి నిర్ధిష్టమైన కారణాల అన్వేషణ కోసం కేంద్ర బృందాలు ఈనెలలోనే తనిఖీలకు రానున్నాయి. ఈ క్రమంలో అధికారులు ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు సరి చూసుకుంటున్నారు. గ్రామ సభ తీర్మానం, ఎన్‌వోసీ పత్రం, పనుల ప్రదేశాల్లో బోర్డులు, చేసిన వ్యయం, ఎంత మందికి పని కల్పించామనే వివరాలు, పని ప్రారంభానికి ముందు, ఆ తర్వాత ఫొటోలు సేకరిస్తున్నారు. కేంద్ర

మిగతా 8వ పేజీలో..

వర్షాలు తక్కువ పడడం వల్లే పనులు పెరిగాయి

- కె.నాగ పద్మజ, డీఆర్‌డీవో గ్రామీణాభివృద్ధి శాఖ, హనుమకొండ జిల్లా



2022-23 సంవత్సరంలో కన్నా 2023-24లో వర్షాలు తక్కువ పడ్డాయి. చాలినన్ని వర్షాలు పడకపోవడంతో చెరువులు, కుంటలు, బావులు ఎండిపోయాయి. దీంతో సహజంగానే గ్రామాల్లో వ్యవసాయ పనులు మందగించాయి. కూలీలకు వ్యవసాయ పనులు దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో కూలీలంతా ఉపాధి హామీ పనులవైపు మళ్లారు. పైగా కేంద్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ పథకం కింద ప్రతీ గ్రామ పంచాయతీలో గరిష్ఠంగా 25 మంది కూలీలకు పని కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఆ మేరకు కూలీలను సమీకరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అదే లక్ష్యం ప్రకారం ఉపాధి పనులను చేయించాం. దీంతో సహజంగానే 2023-24 సంవత్సరంలో పని దినాలు పెరిగాయి. అంతేకాకుండా ఎన్ఆర్ఎం పనులు కూడా ఈ సారి ఎక్కువ చేశారు. దీనికితోడు వ్యవసాయాధారిత పనులు చేపట్టాము. ఈ కారణాలను ప్రభుత్వానికి రాసి పంపాము.



సార్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

స్వరాష్ట్రం కోసం తపించిన మహనీయుడు

జయశంకర్ సార్ జయంతిలో కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 6: స్వరాష్ట్ర సాధన కోసం నిరంతరం పరితపించిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని కలెక్టర్ సత్యశారద కొనియాడారు. జయశంకర్ 91వ జయంతిని వేడుకలను మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం జయశంకర్ సార్ చేసిన కృషి, త్యాగాన్ని తెలంగాణ ప్రజలు సదా స్మరించుకుంటారని, రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయశంకర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని సూచించారు. జన్మదినం సందర్భంగా వారి నామకరణంతో మొక్కను నాటితే, మొక్క ఎదుగుతున్నా కొద్ది విద్యార్థుల్లో గొప్ప ఆలోచనలు ఎదుగుతాయన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, పర్యవేక్షకులు రమేశ్, చంద్రశేఖర్, మంజుల, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్ : మేయర్



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య జయశంకర్ సార్ అని, తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని మేయర్ గుండు సుధారాణి కొనియాడారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జయశంకర్ సేవలను గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా ఆయన జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణపై వివక్షతను రాష్ట్ర ప్రజల్లోకి తీసుకెళ్లడంతో శక్తివంచన లేకుండా పనిచేశారని అన్నారు. ఇన్‌చార్జి అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, సిటీ ప్లానర్ ఎం.శైలజ, టీపీఆర్‌వో కోలా రాజేశ్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఏసీపీ ఖలీల్, జేఏవో జగదీశ్వరి, సూపరింటెండెంట్ సంతోష్ పాల్గొన్నారు.

వరంగల్ డీఐఈవోగా శ్రీధర్ సుమన్



వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6: వరంగల్ జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ అధికారి(డీఐఈవో)గా జి.శ్రీధర్ సుమన్‌ను నియమిస్తూ ఇంటర్ విద్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలే బదిలీపై ఖానాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్ వచ్చిన ఆయనకు జిల్లా డీఐఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా శ్రీధర్ సుమన్ ప్రస్తుతం మహబూబ్‌నగర్ డీఐఈవోగా పనిచేస్తున్నారు.

కొత్త రేషన్ కార్డులకు ఎన్నికల గండం

- కార్డుల జారీకి సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సర్కార్
- సబ్ కమిటీ నివేదిక తరువాత దరఖాస్తుల పరిశీలన
- పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ప్రక్రియలో జాప్యమేనా?

7

ఆరోగ్య సమాజాన్ని నిర్మించాలి

- అందరికీ పౌష్టికాహారం అందించాలి
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి
- గీసుగొండ, దుగ్గొండి మండలాల్లో పర్యటన



గీసుగొండ మండలం కస్తూర్బా బాలికా విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి



గిర్నిబావిలోని గురుకులంలో కూరగాయాలను పరిశీలిస్తున్న చైర్మన్

గీసుగొండ, ఆగస్టు 6: విద్యార్థులకు, నవజాత శిశువులకు, బాలింతలకు, గర్భిణులు, వృద్ధులకు పౌష్టికాహారం అందించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీని వాస్‌రెడ్డి సూచించారు. గొర్రెకుంట పాఠశాలలు, రేషన్‌షాపులు, వంచనగిరిలోని కస్తూర్బా పాఠశాలను, గీసుగొండలోని అంగన్‌వాడీ సెంటర్‌లను మంగళవారం పరిశీలించారు. గొర్రెకుంటలో రేషన్ షాపుల్లో తీసుకున్న బియ్యాన్ని ఏమి చేస్తున్నారు, తూకంలో ఏమైనా తేడా వస్తుందా అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గొర్రెకుంట పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వంటనిర్వాహకులకు సూచించారు. అనంతరం కస్తూర్బా బాలిక విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న పోషక ఆహారపదార్థాలు, స్నాక్స్, నాణ్యత ఎస్‌వోను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో కూడిన ఫుడ్ కమిటీలు ఉన్నాయా, ఫుడ్ బాగా లేకపోతే ఎవరిని అడుగుతారంటూ ఆరా తీశారు. అనంతరం ఆవరణలో డీఆర్‌డీవో కౌసల్యతో కలిసి మొక్కలు నాటారు. గీసుగొండలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అంగన్‌వాడీ సెంటర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ కమిటీ సభ్యులు ఆనంద్, జ్యోతి, భారతి, శారద, డీఆర్‌డీవో కౌసల్య, డీఈవో వాసంతి, సివిల్ సప్లై డీఎస్‌వో శివప్రసాద్, డీఎం సంధ్యారాణి, డీటీసీఎస్‌లు కిరణ్, సంధ్య, ఎంపీడీవో కమలాకర్, ఎంఈవో సత్యనారాయణ, ఎంఎస్‌వో రవీందర్, డీటీ రవీందర్‌రావు, ఆర్‌ఐ సాంబయ్య, ఏఈ సుధాకర్, ఎస్‌వో హిమబిందు, హెచ్‌ఎంలు జ్యోతిర్మయి, అన్నపూర్ణ, కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

దుగ్గొండి: గురుకులం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి మంచిపేరు తీసుకురావాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం గిర్నిబావిలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలుర విద్యాలయాన్ని కమిషన్ సభ్యులతో కలిసి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, కూరగాయలను పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం సన్న బియ్యంతోపాటు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు భారతి, ఆనంద్, శారద, జ్యోతి, డీఈవో వాసంతి, ఆర్‌సీవో మనోహర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఓదేల మల్లయ్య పాల్గొన్నారు.



వరంగల్ అభివృద్ధిపై మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- జిల్లా అధికారులతో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 6: వరంగల్ సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ నగరాభివృద్ధిపై మంగళవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. ఇందుకనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. వరంగల్ నగరం చుట్టుపక్కల ఉన్న ఇన్నర్, ఔటర్ రింగురోడ్డు, ఎయిర్‌పోర్టులో భూములు కోల్పోయిన రైతులకు మానవీయకోణంలో న్యాయం చేస్తామన్నారు. చారిత్రక భద్రకాళి దేవాలయం పనులు ఆగమ శాస్త్రం ప్రకారం జరుగుతాయన్నారు. సీజన్‌వ్యాధులు ప్రబల కుండా ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్లు స్పందించి తగు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు పాల్గొన్నారు.

సదరం స్లాట్ నిరంతరం

- వెసలుబాటు కల్పించిన ప్రభుత్వం
- దివ్యాంగులకు తప్పిన నిరీక్షణ
- మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 6: సదరం స్లాట్‌పై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుండడంతో దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగులు పింఛన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంగవైకల్యం నిర్ధారించేందుకు ముందుగా సదరం స్లాట్ నమోదు చేసుకొని, ఆ తర్వాత శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. బాధితులు ఎక్కువ సంఖ్యలో ఉన్నా స్లాట్ తక్కువగా విడుదల అయ్యేవి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా దివ్యాంగులకు పింఛన్‌ను రూ.6వేలు ఇస్తామని ప్రకటించింది. దీంతో దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం పరుగులు తీస్తున్నారు. స్లాట్ దొరక నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

తప్పిన నిరీక్షణ

సదరం శిబిరంలో సుమారు 100 నుంచి 120 మందికి మాత్రమే వైద్యాధికారులు అవకాశం కల్పించే వారు. దివ్యాంగుల నుంచి మీ సేవా నిర్వాహకులు సైతం అధికంగా డబ్బులు వసూలు చేసే వారు. దివ్యాంగుల సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిరంతర స్లాట్ బుకింగ్ ప్రక్రియను ప్రవేశపెట్టింది. ఇక నుంచి సదరం సర్టిఫికెట్ కోసం మీ సేవా కేంద్రాల్లో ఎప్పుడైనా స్లాట్ బుక్ చేసుకునేలా వెసలుబాటు కల్పించింది. సదరం శిబిరానికి సంబంధించిన తేదీలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు ప్రతి నెలాఖరారు చేస్తారు. నెల ప్రారంభం కాగానే మూడు లేదా నాలుగు రోజుల్లో శిబిరాలు నిర్వహిస్తారు.

స్లాట్ బుకింగ్ ఇలా

కొత్తగా సదరం స్లాట్ పొందేందుకు మీ సేవా కేంద్రాల్లో ఆధార్, పాస్‌ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలి. శిబిరం నిర్వహించే తేదీ, సమయం మొబైల్ ఫోన్‌కు సమాచారం వస్తుంది. కేటాయించిన తేదీల్లో శిబిరానికి చేరుకోవాల్సి ఉంటుంది. గతంలో సదరం సర్టిఫికెట్ ఉండి రెన్యూవల్ చేసుకునే వారు సదరం స్లాట్ నమోదు చేసుకోవాలి. తర్వాత మీ సేవా కేంద్రం నుంచి సర్టిఫికెట్ జారీ చేస్తారు. దృష్టిలోపం, చెవిటి, మానసిక వికలాంగుల కోసం వేర్వేరు తేదీల్లో శిబిరాలు నిర్వహిస్తారు. ఎంజీఎం ఆస్పత్రితో పాటు ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో సదరం శిబిరాలు ఆయా తేదీల్లో నిర్వహించడం జరుగుతుంది. పాత సదరం సర్టిఫికెట్‌తో వారికి కేటాయించిన సదరం శిబిరం తేదీల ప్రకారం హాజరు కావాల్సి ఉంటుంది.

స్లాట్ బుకింగ్ ఎప్పుడైనా చేసుకోవచ్చు

- కౌసల్యాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి.



గతంలో నెలలో ఒక్కో కేటగిరికి ఒక్కో సదరం శిబిరం నిర్వహించడం జరిగేది. ఇప్పుడు స్లాట్ల సంఖ్య పెంచడంతోపాటు శిబిరాల సంఖ్యను ప్రభుత్వం పెంచింది. సదరం సర్టిఫికెట్ కోసం దివ్యాంగులు ఎప్పుడైనా సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఎక్కువ మంది స్లాట్ బుక్ చేసుకున్నా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యాధికారులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరం స్లాట్ బుకింగ్‌కు రూ. 45 మాత్రమే వసూలు చేయాలి.



29 అడుగులకు పాకాల సరస్సు



29 అడుగుల పాకాల నీటిమట్టం

ఖానాపురం, ఆగస్టు 6: జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పాకాల సరస్సు నీటిమట్టం మంగళవారం నాటికి 29 అడుగులకు చేరుకుంది. 30.2 అడుగుల పూర్తి నీటిసామర్థ్యం గల పాకాల సరస్సు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలకళను సంతరించుకుని మత్తడికి చేరువలోకి చేరుకుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా పాకాల ఆయకట్టులో వరి నాట్లు కొనసాగుతున్నాయి.

పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి


పాకాల సరస్సు సందర్శనకు వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రఘుపతి సూచించారు. సరస్సు, మత్తడిని వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు మంగళవారం పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సరస్సులోకి, మత్తడిలోకి దిగొద్దని, సరస్సులో మొసళ్లు ఉన్నందున ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. సరస్సులోకి దిగడం, సెల్ఫీలు తీయటం చేయొద్దన్నారు. విలువైన వస్తువులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రాయపర్తిలో అనుమతి లేని క్లినిక్ సీజ్



క్లినిక్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

రాయపర్తి, ఆగస్టు 6: విద్యార్హతలు, ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాల్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని భవాని క్లినిక్ పేరుతో వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్ జెర్రిపోతుల కృష్ణను గుర్తించి, ఆయన విద్యార్హతలు, అనుమతులు, ఇతర రికార్డులను పరిశీలించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో క్లినిక్‌ను సీజ్ చేసినట్టు వెల్లడించారు. నకిలీ వైద్యం చేస్తున్న కృష్ణపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు క్లినిక్‌లు ఏర్పాటు చేసి అందులోనే మెడికల్ షాపులు నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రమోహన్, వైద్య సిబ్బంది మత్యాస్‌రెడ్డి, శ్యాంసుందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

బీసీ నేత జక్కని సంజయ్ కుమార్

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోటా అమలు కోసం ఈనెల 10వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని ఒక హోటల్‌లో బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం వాటా అమలుకు అన్ని బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని బీసీలు విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ బీసీల కోసం పోరాటం చేస్తున్నారని, ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్ ప్రకటించినందునే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని, కనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తప్పక అమలుచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పంజల రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బీసీ నాయకులు తిరుపతి, బొంగోని అభిలాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జక్కని సంజయ్ కుమార్

మేడిగడ్డకు కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 6: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రభావం కొనసాగుతోంది. మంగళవారం ఇన్‌ఫ్లో 3.62లక్షల క్యూసెక్కులు ఉండగా 85 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం సోమవారం 4.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో బ్యారేజీ వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతున్నట్లు తెలిపారు. అన్నారం బ్యారేజీకి 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 6: కాకతీయ యూనివర్సిటీ పోలీసులు మంగళవారం పేకాటాడుతున్న వారిని అరెస్టు చేశారు. కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. రూ.1లక్ష 23వేల నగదు స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.





హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న బెగ్లూర్ భక్త బృందం

ఐలోని మల్లన్న సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణం

ఐనవోలు, ఆగస్టు 6: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానంలో మంగళవారం హనుమాన్ చాలీసాతోపాటు భక్తిగీతాల పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామానికి చెందిన హనుమాన్ చాలీసా పారాయణ బృందం సుమారు 25 మంది పాల్గొని పారాయణం చేసి ఆధ్యాత్మికతను చాటారు. భక్తులు ఎంతో భక్తితో ఆలకించారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, బృందం అధ్యక్షుడు దారం రమణయ్య, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత


వరంగల్ క్రైం, ఆగస్టు 6: హసన్‌పర్తి మండల కేంద్రంలో రూ.6,800 విలువైన నిషేధిత గుట్కాను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏఎస్ఐ మల్లిఖార్జున్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, నాగరాజు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల కేంద్రంలో అన్నం సురేష్ గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు సురేష్ నిర్వహిస్తున్న కిరాణషాపుపై దాడులు నిర్వహించి గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. పరారయ్యేందుకు ప్రయత్నించిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మల్లిఖార్జున్ తెలిపారు.





















అద్దింటోళ్లంటే.. అంత అలుసా?

కొందరు యజమానుల తీరుతో కిరాయిదారుల అవస్థలు

- ఏ మాత్రం అసౌకర్యమైనా తక్షణం ఖాళీకి ఒత్తిడి
- కాలనీవాసుల్లోనూ అద్దింటోళ్లపై చులకన భావం
- బ్రహ్మచారులు, నిమ్నవర్గాల వారికి దొరకటం గగనమే..
- భారీగా పెరిగిన అద్దె రేట్లతో ఇబ్బందులు



హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో అద్దె ఇంట్లో ఉన్న వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. యజమానులు షరతులు పెడుతూ ఏమాత్రం ఇబ్బంది కలిగినా తక్షణమే ఖాళీ చేయిస్తున్నారు. అలాగే చుట్టుపక్కల ఉండే సొంతిళ్ల వారితో ఇబ్బందులు తప్పడం లేదు. వారు చూసే చిన్నచూపు, సూటిపోటి మాటలతో అద్దె కుటుంబం తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. అయితే తప్పని పరిస్థితుల్లో కాలం వెల్లదీస్తున్నారు. బతుకు దెరువుకోసం నగరానికి వలస వచ్చే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. దీనికి తోడు పైచదువుల కోసం నగరానికి వచ్చే విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో ఉంటున్నారు. కొందరికి మాత్రమే హాస్టల్ వసతి సమకూరుతోంది. మిగతా వారంతా అద్దె ఇళ్లలోనే తలదాచుకోక తప్పడం లేదు. ప్రైవేటు హాస్టళ్లలో ఉండాల్సి వస్తే భరించలేనంతగా ఫీజులు ఉంటున్నాయి. ఆర్థిక స్థోమత లేని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు నలుగురైదుగురు కలిసి ఇల్లు అద్దెకు తీసుకొని ఏదో విధంగా తక్కువ ఖర్చుతో నెట్టుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

షరతులతో బెంబేలు

పట్టణీకరణ పెరిగిన తర్వాత అద్దె ఇళ్లు పిరమయ్యాయి. అపార్టుమెంట్ సంస్కృతి పెరిగిన తర్వాత ఇండిపెండెంట్ ఇల్లు దొరకడం కష్టంగా మారింది. దొరికినా అద్దె రేట్లు ఆకాశన్నంటుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ ఇదే పరిస్థితి. ఈ క్రమంలో ఎక్కడైనా టు లెట్ బోర్డు కనిపిస్తే ఎగిరి గంతేసి వెళ్లి వాకబు చేస్తే యజమాని పెట్టే నిబంధనలతో చుక్కలు కనిపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోయినా అద్దెలు మాత్రం దండిగానే వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఏటా 10 నుంచి 15శాతం పెంచుతున్నారు.

క్షణాలమీద ఖాళీకి ఒత్తిడి

యజమానులు అద్దెలను ఇష్టారాజ్యంగా పెంచడమే కాదు.. పెంచినంత అద్దె ఇవ్వడానికి అద్దెకున్నవారు ఏ మాత్రం తటపటాయించినా ఖాళీ చేయమని హుకుం జారీ చేస్తున్నారు. అలాగే తమతో ఏ చిన్న తగాదా వచ్చినా తట్టాబుట్టా సర్దుకోమని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో తమ ఇంట్లో శుభకార్యం ఉన్నా, లేదా ఇతర దేశాలు, ప్రాంతాల్లో ఉండే కుమారులు, కుమార్తెలు వచ్చినా అద్దెకున్నవారిని నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయిస్తున్నారు. మరమ్మతులు చేయించాలనుకున్నా, లేదా కూలగొట్టి మళ్లీ కట్టాలనుకున్నా కనీస ముందస్తు సమాచారం లేకుండానే ఖాళీ చేయాలని చెబుతున్నారు. మరో ఇల్లు వెతుక్కోవడానికి సమయం కూడా ఇవ్వడం లేదు. వాస్తవానికి అద్దెకున్నవారిని ఖాళీ చేయించాలనుకుంటే టెనెంట్ యాక్టు ప్రకారం ఇంటి యజమానులు కొన్ని నిబంధనలు పాటించాలి. అద్దెకున్నవారికి మూడు నెలలు ముందు సమాచారం ఇవ్వాలి. లేదా మరో ఇల్లు అద్దెకు దొరికే వరకు అవకాశమివ్వాలి. తక్షణం ఖాళీ చేయించే హక్కు లేదు. ఒక వేళ అలా చేస్తే అద్దెకున్నవారు సాయం కోసం పోలీసులను ఆశ్రయించవచ్చు.

దారుణంగా పెరిగిన అద్దెలు

నగరంలో పెరిగిన అద్దెలతో జనం అల్లాడిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఉన్న ఇంటి అద్దెలతో పోల్చితే ఇప్పుడున్న అద్దెలు మరీ ఎక్కువగా పెరిగాయి. దీంతో పేదలు, సామాన్యులకు బాడుగ ఇళ్లలో ఉండడం కూడా భారంగా మారింది. ఇటీవల కాలంలో హైదరాబాద్ లాంటి నగరాల్లో ఇంటి అద్దెలు 9 శాతం పెరిగితే.. వరంగల్ నగరంలో 6 నుంచి 7 శాతానికి పెరిగాయి. ఇక బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, చౌరస్తా లాంటి ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు అద్దె ఒక రేటు, కాస్త దూరంగా ఉన్నవాటికి మరో రేటు. హనుమకొండ చౌరస్తా, బ్రాహ్మణవాడ, మచిలీబజార్, కాపువాడ, అలంకార్ జంక్షన్, కాజీపేట, నయీంనగర్, నిట్ కేయూ 100 అడుగుల రోడ్డు, కేయూ క్రాస్ రోడ్డు, అంబేద్కర్ జంక్షన్, ఎన్జీవోస్ కాలనీ రోడ్డు, టీచర్స్ కాలనీ, రెడ్డి కాలనీ, అడ్వకేట్స్ కాలనీ, బాలసముద్రం లాంటి నగరం నడిబొడ్డున ఉన్న కాలనీల్లో ఇళ్ల అద్దెలు భగ్గుమంటున్నాయి. సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ. 5వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ.7వేల నుంచి రూ.8వేలు, ట్రిబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ. 10వేల నుంచి రూ.15వేల మధ్య అద్దెలు ఉంటున్నాయి. కారు పార్కింగ్, ఇంటీరియర్ డిజైన్లు ఉంటే ఆ ఇళ్లకు వేరే రేటు ఉంటోంది. మెరుగైన సౌకర్యాలు ఉన్న ఇళ్ల అద్దెలు ఇంతకన్నా ఎక్కువనే పలుకుతున్నాయి. అపార్ట్‌మెంట్లలో అయితే డబుల్ లేదా ట్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ల అద్దె రేట్లు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఉంటున్నాయి. దానికి మెయింటనెన్స్ చార్జీల రూపంలో రూ.1500 నుంచి రూ.2వేలు అదనంగా తీసుకుంటున్నారు. దీంతో చాలామంది నగర నగర శివార్లలో ఉన్న కాలనీలోని ఇళ్లను ఆశ్రయిస్తున్నారు.

ఇళ్లు గగనమే

నగరంలో కొన్ని వర్గాల వారికి అద్దె ఇల్లు దొరక్కపోవడం గగనమే అవుతోంది. దళితుల లాంటి నిమ్నవర్గాలకు ఇళ్లు ఇవ్వడానికి అగ్రకులాల యజమానులు నిరాకరిస్తున్నారన్న అపవాదు ఉంది. టు లెట్ బోర్డు చూసి వెళ్లినవారిని మొదట కులమేంటని అడుగుతున్నారు. తక్కువ కులం వారైతే ఇళ్లు ఖాళీగా ఉన్నా లేవని చెప్పి పంపించేస్తున్నారు. చివరకు వారు దళితులకు చెందిన ఇళ్లలో అద్దెకు దొరికితే అదే అదృష్టంగా సర్దుకుపోతున్నారు. అలాగే, బ్రహ్మచారులకు ఇళ్లు అద్దెకు ఇవ్వడానికి యజమానులు వెనుకాముందాడుతున్నారు. పెళ్లీడుకువచ్చిన అమ్మాయిలున్న యజమానులైతే ససేమిరా అంటున్నారు. బ్రహ్మచారులకు ఇల్లు అద్దెకు ఇస్తే ఇబ్బందులు ఎదర్కొనవలసి వస్తుందన్న భయంతో వారికి నో చెబుతున్నారు. దీంతో బ్యాచిలర్స్ తమ స్నేహితుల ఇళ్లు, లేదా హాస్టల్ గదుల్లో తలదాచుకుంటున్నారు.

అర్ధంతరంగా ఖాళీ చేయించాడు

కుమారస్వామి, బాలసముద్రం, హనుమకొండ

నా ఆఫీసుకు దగ్గరగా ఉంటుందని అద్దె ఎక్కువైనా చెల్లించి హనుమకొండ బాలసముద్రంలోని ఒక అద్దె ఇంట్లో కుటుంబంతో రెండేళ్లుగా ఉంటున్నాను. అద్దె కూడా సకాలంలో చెల్లిస్తూ వచ్చాను. ఒక రోజు ఇంటి యజమానికి, మా కుటుంబ సభ్యులకు మధ్య చిన్న తగాదా ఏర్పడింది. అంతే.. యజమాని అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయించాడు. మరో మంచి ఇల్లు వెతుక్కునే అవకాశం కూడా ఇవ్వలేదు. దీంతో అద్దె ఎక్కువైనా సౌకర్యాలు లేకపోయినా దొరికిన ఇంట్లోనే అద్దెకు దిగాము.

కిరాయికి ఉండేటోళ్లా అని నిర్లక్ష్యంగా చూస్తున్నారు..

రామస్వామి, గోపాల్‌పూర్, హనుమకొండ

హనుమకొండలోని గోపాలపూర్‌లోని ఓ సంపన్నమైన కాలనీలో అద్దెకుంటున్నాము. అద్దె కాస్త ఎక్కువే అయినా సర్దుకుపోతున్నారు. కానీ చుట్టుపక్కల సొంతిళ్ల వారు మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారు. ఎవరైనా మా చుట్టాలు, స్నేహితులు మా ఇంటికి వచ్చే క్రమంలో అడ్రస్ అడిగితే గా కిరాయికి ఉన్నోళ్లా.. అంటూ హేళనగా మాట్లాడుతుండడం బాధ కలిగిస్తోంది. పొరుగువారు సొంతిల్లు ఉన్నదన్న పొగరుతో అద్దెకున్నవారిని చిన్నచూపుచూడడం తగదు.

దళితులమని అద్దెకు ఇల్లివ్వలేదు

శ్రీనివాస్, హనుమకొండ

నేను ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగిని. బదిలీ కావడం వల్ల హనుమకొండకు వచ్చాను. మా ఆఫీసుకు, పైగా చౌరస్తాకు దగ్గరగా ఉంటుందని భావించి సమీప ప్రాంతంలో అద్దె ఇంటికోసం వెతికాను. ఇళ్లు ఖాళీగానే ఉన్నా దళితులమని చెప్పగానే ఓ ఇంటి యజమాని ఇల్లు అద్దెకు ఇవ్వలేమని సున్నితంగా చెప్పాడు. చాలా చోట్ల ఇదే పరిస్థితి ఎదుర్కొన్నా. చివరికు నా చిన్ననాటి స్నేహితుడిఇంటిలో అద్దెకు దిగాను.

ఇరుగుపొరుగు వారి చిన్నచూపు

అద్దెకున్నవారంటే ఇంటి యజమానికే కాదు.. ఇరుగు పొరుగువారికి కూడా చిన్నచూపే. వారితో సరిగా మమేకం కావడానికి కూడా ఇష్టపడడం లేదు. సొంతింటి ఇంటి దారులమన్న అహంతో అద్దెకు ఉంటున్నవారిని దూరంగా పెట్టడం కనిపిస్తోంది. కాజీపేట బాలాజీనగర్‌లో తమపై సొంతిళ్లవారు వివక్ష చూపిస్తున్నారని కొందరు అద్దెలకు ఉండే వారు ఆరోపిస్తున్నారు. కొందరు సొంతిళ్ల వారు అద్దెలకు ఉండే వారిపై యజమాలకు లేనిపోని మాటలు చెప్పి మరీ ఖాళీ చేయిస్తున్న పరిస్థితి ఉంది. దీనికి ఆ కాలనీకమిటీ కూడా వత్తాసు పలకడం విస్మయం కలిగిస్తోంది. బాల సముద్రంలోని ఓ కాలనీలో రాత్రి పూట తలుపుల శబ్దం వినబడుతోందని, పిల్లలు అరుస్తున్నారనే చిన్న చిన్న విషయాలపై పక్కింటివారు గొడవపడి యజమానికి చెప్పి మరీ ఖాళీ చేయించిన సందర్భాలున్నాయి.

అద్దెకుండే వారిలో ఎవరైనా చనిపోతే..

అద్దె ఇంట్లోని కుటుంబసభ్యుల్లో ఎవరైనా అనారోగ్యంతోగానీ, మరే ఇతర కారణాల వల్ల ఆస్పత్రిలో లేదా బయట చనిపోతే ఇంటి యజమానులు మృత దేహాన్ని ఇంటికి తీసుకురానివ్వడం లేదు. దీంతో చేసేది లేక కుటుంబసభ్యులు మృతదేహాన్ని అటునుంచి అటే శ్మశానానికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది. ఇంట్లో అద్దెకుంటున్నవారు పది రోజులు బయటనే ఉండి కర్మకాండల తర్వాతే ఇంట్లో అడుపెట్టాల్సి వస్తోంది.

రూ.కోటితో ఉడాయించిన వ్యాపారి?

రెండునెలల్లో భారీగా అప్పులు ● లబోదిబోమంటున్న బాధితులు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 6: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌కు చెందిన ఓ వ్యాపారి అప్పులు చేసి సుమారు రూ.కోటితో ఉడాయించినట్లు ప్రచారం జరుగుతోంది. మండల కేంద్రంలోని పాన్‌షాప్‌లలో సిగరెట్లు, పాన్‌మసాలాలు, ఇతర సామగ్రిని హోల్‌సేల్‌గా సరఫరా చేసే ఈ వ్యాపారి కొద్దిరోజుల కిందట తన కుటుంబంతో సహా అదృశ్యమయ్యాడు. స్థానికంగా సొంత ఇల్లు, ట్రాలీ ఆటో ఉండడంతో పాటు నిత్యం వేల రూపాయల హోల్‌సేల్ వ్యాపారం చేస్తుండడంతో అప్పు అడగగానే ఇచ్చారు. ఒక్కొక్కరి వద్ద రూ. లక్షల నుంచి రూ.10లక్షల వరకు అప్పులు తీసుకున్నట్లు సమాచారం. స్థానికంగా చిట్టీలు నిర్వహించే వారి వద్ద రూ.2లక్షల నుంచి రూ.5లక్షల చిట్టీల్లో చేరి మొదటి నెలలోనే అధిక కమీషన్‌తో ఎత్తుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాతి రెండు, మూడునెలల వరకు సకాలంలో చిట్టీ డబ్బులు చెల్లిస్తూ అదృశ్యం కావడానికి రెండునెలలకు ముందు అప్పులు, ఎత్తుకున్న చిట్టీలు సుమారు రూ.కోటి వరకు పోగేసినట్లు తెలిసింది. కుటుంబం సహా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని ఇక్కడి నుంచి ఉడాయించడం ఓ పథకం ప్రకారమే తక్కువ కాలంలో ఎక్కువ అప్పులు చేసి, చిట్టీలు ఎత్తుకున్నట్లు అనుమానిస్తున్నారు. సొంత ఇల్లుపై బ్యాంకులో రూ.25 లక్షల వరకు రుణం తీసుకోగా, ట్రాలీఆటో ఫైనాన్స్‌లో తీసుకువచ్చిందని తెలుసుకున్న అప్పులిచ్చిన వారు లోలోపల లబోదిబోమంటున్నారు. ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించేందుకు బాధితులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇక చిట్టీల వ్యవహారమంతా అనధికారికం కావడంతో ఎవరికి చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇదిలా ఉండగా వ్యాపారంలో నష్టాలు రావడం, ఆన్‌లైన్ గేమ్‌లను ఆడడంతో దివాళా తీసి ఉడాయించినట్లు మరికొందరు భావిస్తున్నా రు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి వారికి అందుబాటులో ఉన్న ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి ప్రవేశాలు పొందాలని కోరారు. టెన్త్‌కు అడ్మిషన్ ఫీజు ఓసీలకు రూ.1550, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.1150 చెల్లించాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలకు ఓబీసీలకు రూ. 1800, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.1500 ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ శంకర్‌రావు (8008403631, 9396337572)ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఊడిన గూడ్స్ రైలు బోగీల లింకు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 : మహబూబాబాద్-తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల నడుమ అప్‌లైన్‌లో 434 మైలురాయి వద్ద వరంగల్‌వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు బోగీల మధ్య లింక్ (కప్లింగ్) మంగళవారం ఊడిపోయి గూడ్స్ రైలు నిలిచి పోయింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు దానిని సరి చేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో గూడ్స్ వెనుకాల వస్తున్న వందేభారత్ రైలును మానుకోట రైల్వేస్టేషన్‌లో సుమారు అరగంట పాటు నిలిపారు. గూడ్స్ రైలు బోగిలను సరి చేసి పంపించాక మానుకోట రైల్వేస్టేషన్ నుంచి వందేభారత్ రైలు కదిలి వెళ్లిపోయింది.

సర్వీసుల క్రమబద్ధీకరణకు హోంగార్డుల వినతి

వరంగల్ క్రైం, ఆగష్టు 6: రాష్ట్రంలోని హోంగార్డుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను కలిసి హోంగార్డులు వినతిపత్రం ఇచ్చారు. సీనియారిటీ, విద్యార్హతల ఆధారంగా ఏదైనా యూనిఫామ్ సర్వీసులలో విలీనం చేయాలని కోరారు. ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. డీజీపీని కలిసిన వారిలో రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుప్పాల అశోక్, వర్కింగ్ ప్రసిడెంట్ దయానంద్, జాయింట్ సెక్రెటరీ నారాయణరెడ్డి, పీఆర్‌వో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

వీరభద్రస్వామి దీక్షలో మంత్రి పొన్నం



వీరభద్రస్వామి మాలను ధరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఆగస్టు 6: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి నక్షత్ర దీక్షను బీసీ సంక్షేమ, రావాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం స్వీకరించారు. 27రోజులుగా ఉండే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షను ఆలయ ముఖ్య అర్చకుడు, దీక్షల గురుస్వామి మొగిలి పాలెం రాంబాబు వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రుడి ముద్రికతో ఉన్న మాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మెడలో వేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు పాటు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎన్నికలకు ముందు తాను ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షలు తీసుకుంటానని మొక్కుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్ మంత్రిగా కూడా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో 27రోజుల పాటు దేవాలయంలో నియమ నిబంధనలకు అనుగుణంగా పూజ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తకొండ వీరభద్రస్వామి చరిత్రను రాష్ట్ర ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ద్వాదశ జ్యోతిలింగాల్లో ఒకటైనా శ్రీశైలం మల్లిఖార్జున స్వామిని సోమవారం దర్శించుకున్నానన్నారు. శ్రీశైలంలో దేవుడి పక్కనే భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి విగ్రహం ఉందన్నారు. ఇంత మహిమ కలిగిన ఈ దేవాలయాల్లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లోని భక్తులు పెద్దఎత్తున తరలివస్తారన్నారు. ఈ విశ్వాసం భక్తులకు ఆకాంక్షలకు అనుగుణంగా వీరభద్రస్వామి దీక్ష తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మంజులారెడ్డి, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చంద్రశేఖర్‌గుప్తా, చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, కేతిరి లక్ష్మారెడ్డి, మంగ రామచంద్రం, కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు డీజీపీ ప్రశంసలు



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ శ్రీధర్‌రావు

వరంగల్ క్రైం, ఆగస్టు 6: హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడటానికి కృషి చేసిన ఇద్దరు సీఐలతో పాటు గతంలో వరంగల్‌లో పనిచేసిన ఏసీపీ, ఎస్ఐలకు డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసు అధికారుల సమావేశంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. పత్రాలు అందుకున్న వారిలో ప్రస్తుతం సీసీఆర్‌బీలో పనిచేస్తున్న సీఐ శ్రీధర్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి, మామూనూర్ సీఐ రవికుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యానారాయణరెడ్డి, అడిషినల్ ఎస్పీ బోనాల కిషన్, తొర్రూరు ఎస్ఐ జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసుదేవరెడ్డి ఉన్నారు. కాగా, వీరిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అభినందించారు.

జర్నలిజంలో మార్పులు సహజమే..

సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు డాక్టర్ ఎస్.వెంకటనారాయణ



డాక్టర్ వెంకటనారాయణకు జ్ఞాపికను బహుకరిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

వడ్డెపల్లి, ఆగస్టు 6: మారుతున్న కాలానికనుగుణంగా జర్నలిజంలో మార్పులు సహజమేనని ఇండియాటుడే పూర్వప్రతినిధి, మల్టీ మీడియా ఇండిపెండెంట్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు డాక్టర్ ఎస్. వెంకటనారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జర్నలిస్టులతో చిట్‌చాట్ చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం జర్నలిజంలో వస్తున్న మార్పుల కనుగుణంగా డిజిటల్ మీడియా హవా చలాయిస్తోందని అన్నారు. బంగ్లాదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా భారత్‌తో స్నేహపూర్వకంగా ఉండాల్సిందేనని చెప్పారు. బంగ్లాదేశీయులు లండన్‌లో రెస్టారెంట్లు పెట్టుకున్నారని, అయితే పాకిస్తానీయులైనా, బంగ్లాదేశీయులైనా ఇండియన్ రెస్టారెంట్ పేరుతో నడిపిస్తారని చెప్పారు. భారతదేశం అంటే ప్రపంచమంతా తెలుసునని, బంగ్లాదేశ్ పేరు చెప్పితే ఎవరికీ తెలియదని అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లతో ఆ దేశ ప్రధాని షేక్‌హసీనా నేరుగా ఇండియాకు వచ్చారని పేర్కొన్నారు. అయితే ఇక్కడి ప్రధానిని కానీ మరెవరిని కలవలేదని అన్నారు. నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ మాత్రమే వెళ్లి మాట్లాడారని చెప్పారు. తాను ఏపీ సీఎం చంద్రబాబు జీవిత చరిత్ర రాస్తున్నానని తెలిపారు. ఈ నెల 22 నుంచి రెండు వారాల పాటు ఏపీలోని అమరావతిలో ఉంటానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బొళ్ల అమర్, ప్రెస్‌క్లబ్ బాధ్యులు గోకారపు శ్యామ్, విష్ణువర్ధన్, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, పిన్న శివకుమార్, పీవీ మదన్‌మోహన్, వల్లాల వెంకటరమణ, చిలుముళ్ల సుధాకర్, వేముల సదానందం, మెండు రవీందర్, అంతడుపుల శ్రీనివాస్, నన్నపునేని భరత్, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావుతో పాటు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ అలుగు వర్షిణి



మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో మొక్కను నాటుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేకాధికారి అలుగు వర్షిణి

మహబూబాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించి, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్ధామని 'స్వచ్ఛదనం-పచ్చదనం' జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ అలుగు వర్షిణి అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట, జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తపేటలో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంలో గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక బృందాలు, వీవోలు, పంచాయతీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం తీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటా రు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలో తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అనే నాటికను ప్రదర్శించగా పిల్లలతో కలిసి వీక్షించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రామ స్థాయిలో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని, అంతర్గత రోడ్ల అభివృద్ధి, గ్రామంలో స్వచ్ఛత, పచ్చదనం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనంను పక్కాగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రత్యేకాధికారులను నియమించి క్షేత్రస్థాయిలో విజయవంతం చేస్తున్నామని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, మానుకోట ఆర్డీవో అలివేలు, జిల్లా అధికారులు నర్మద, హరిప్రసాద్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, దైవాదీనం, చంద్రస్వామి పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు ఎన్నికల గండం

- కార్డుల జారీకి సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సర్కార్
- సబ్ కమిటీ నివేదిక తరువాత దరఖాస్తుల పరిశీలన
- త్వరలోనే జారీ చర్యలంటున్న అధికారులు
- పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ప్రక్రియలో జాప్యమేనా?



హనుమకొండ సిటీ, ఆగస్టు 6: కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్డుల జారీ ఉంటుందని ప్రకటించిన వెంటనే కేబినెట్ కూడా ఆమోదం తెలపడంతో పాటు కార్డుల జారీ విధానాల కోసం ప్రభుత్వం ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీంతో హనుమకొండ జిల్లాలో రేషన్ కార్డుల జారీకోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనే వారిలో ఆశలు చిగురించాయి. కానీ పంచాయతీ ఎన్నికలు వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. రేపో,మాపో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ అనే సంకేతాలు ఉండగా.. అదే జరిగితే ఎన్నికల ప్రక్రియలో యంత్రాంగం తలమునలై కార్డుల జారీలో జాప్యం జరుగుతుందేమో అనే సందేహాలు నెలకొంది. కానీ ప్రభుత్వం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటుందని లబ్ధిదారులు ఆశిస్తున్నారు.

సబ్ కమిటీ ఏర్పాటు

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉప సంఘం పేదలకు రేషన్ కార్డులజారీకి సంబంధించిన విధి విధానాలను నిర్దేశించనుంది. ఆపై ముఖ్యమంత్రికి నివేదించిన అనంతరం రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆరంభం కానుందని పౌర సరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. సబ్ కమిటీ కార్డుల జారీ మార్గ దర్శకాలను రూపొందించిన తరువాత ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలను వెల్లడి చేస్తోందని, ఆ తరువాత కార్డుల జారీ ప్రక్రియ జిల్లాలో ఆరంభం అవుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

తొమ్మిదేళ్లుగా నమోదుతోనే సరి

బీఆర్ఎస్ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీకి అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్త కార్డులతో పాటు అదనంగా కుటుంబ సభ్యుల పేర్ల నమోదు దరఖాస్తులను చేపట్టారు. కానీ ఒక్క కార్డు జారీ కాలేదు. ఇలా తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలన కార్డులను జారీ చేయకుండానే ముగిసింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగానే రేషన్‌కార్డుల జారీకి సిద్ధమని ప్రకటించింది. ఇటీవల సబ్‌కమిటీ ఏర్పడడంతో త్వరలో కార్డులు వస్తాయని దరఖాస్తుదారులు ఆశపడుతున్నారు.

జిల్లాలో 5580 దరఖాస్తులు

హనుమకొండ జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 5,580దరఖాస్తులు నమోదయ్యాయి. ప్రభుత్వం జిల్లాల వారీగా రేషన్‌కార్డుల దరఖాస్తుల సంఖ్యను కోరిన క్రమంలో జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు 5,580 దరఖాస్తుల పరిశీలన ఆరంభమై అర్హుల సంఖ్య నిర్ధారణ కానుంది. అదే విధంగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్పుల ప్రక్రియ కూడా ఉండనుంది.

పంచాయతీ ఎన్నికల భయం

కొత్త కార్డుల జారీపై ఒక ఆనందం.. ఆ వెంటే పం చాయతీ ఎన్నికల భయం దరఖాస్తుదారులను వెంటా డుతోంది. రేపో, మాపో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయనే సంకేతాలు, నోటిఫికేషన్ విడుదల అం శం దరఖాస్తుదారుల్లో సందేహాన్ని కలిగిస్తోంది. ఇదే జరిగితే కార్డుల జారీకి మళ్లీ అవరోధం తప్పని పరిస్థితి. పంచాయతీ ఎన్నికలు, ఆపై జిల్లా పరిషత్ ఎన్నికలు, కోడ్ ముగిసిన తరువాత అంతా సర్దుబాటు చేసే సమయం.. ఇదంతా జరిగే వరకు మరో మూడు నెలల బ్రేక్ తప్పదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కేయూ పీఎస్‌లో బాలుడితో సీఐ సంజీవ్

కిడ్నాపైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

వరంగ్ క్రైం, ఆగష్టు 6: బిస్కెట్లు ఇస్తానని చెప్పి.. బిట్టు అనే ఐదేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయగా, గంట సమయంలో బాలుడిని పట్టుకున్న కేయూ పోలీసులు.. తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన మంగళవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలోని పూరిగుట్ట ప్రాంతానికి చెందిన బాలుడు కిడ్నాప్ అయినట్లు సమాచారం అందుకున్న సీఐ సంజీవ్.. సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వెతుకుతున్న క్రమంలో పోలీసుకాలనీకి చెందిన పంతేగాని కార్నేయస్ (రైల్వే ఉద్యోగి) అనే వ్యక్తి బండిమీద బాలుడిని తీసుకుని వెళుతుండగా అనుమానం వచ్చి పట్టుకున్నారు. విచారణలో బిట్టును కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నట్లు నిర్ధారణ అయింది. కాగా, కార్నేయస్‌ను అదుపులోకి తీసుకుని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితుడు కార్నేయస్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు. కాగా, బిట్టు మహబూబాబాద్ జిల్లా ఉత్తర తండాకు చెందిన బోడ సురేష్ - ప్రియాంక దంపతుల కుమారుడు. పూరిగుట్ట వద్ద అమ్మమ్మ వినోద వద్ద ఉంటున్నాడు.

నేటి నుంచి పోచమ్మ బోనాలు

శంభునిపేట, ఆగస్టు 6: శంభునిపేటలోని కాకతీయుల కాలం నాటి పోచమ్మ ఆలయంలో బోనాలు బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఆలయ అభివృద్ధి, పూజారుల కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుభ్రం చేసి రంగులుఅద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. శాలివాహన (కుమ్మరి) పూజారులు గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి బియ్యం, పసుపు, కుంకుమ, పూజా ద్రవ్యాలను సేకరించి తమ పూజాద్రవ్యాలతో జత చేసి పోచమ్మ తల్లికి తొలిబోనాన్ని సమర్పిస్తారు.



ముస్తాబవుతున్న పోచమ్మ దేవాలయం

‘ఉపాధి’పై అనుమానాలు!

5వ పేజీ తరువాయి

బృందాల తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూస్తే ఉపాధి పనులకు నిధుల మంజూరులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒత్తిడితోనే..

ఈ ఏడాది ఉపాధి పనులను లక్ష్యానికి అనుగుణంగా చేపట్టాలని సిబ్బందిని పురమాయించడంతోపాటు గతానికంటే భిన్నంగా రోజు వారీ ప్రగతిపై సమీక్షించడం వల్లే కూలీల హాజరు సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర బృందాల తనిఖీల్లో వాస్తవాలు వెలుగు చూడనున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయాల్లో పనులు, కూలీలు, పని దినాలకు సంబంధించిన రికార్డులను తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఈ వేసవిలో కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు వెతుక్కునే అవకాశం లేకుండా స్థానికంగానే ఉపాధి పథకం కింద పనులు చూపిస్తామని అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతో కూలీల సంఖ్య పెరిగింది. ఉపాధి కూలీ రూ.270నుంచి రూ.300 పెరగడంతో అధిక సంఖ్యలో పనులు చేసేందుకు కూలీలు ముందుకు వస్తున్నారనేది మరో కారణం. క్షేత్ర స్థాయిలో వారానికి ఒక రోజు పనులు పరిశీలించడంతోపాటు, కూలీల హాజరు తక్కువగా ఉన్న చోట పెంచేలా అవగాహన కల్పించారు. వార్షిక ఉపాధి ప్రణాళికలో రూపొందించిన పనుల దినాల్లో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 70 శాతానికి చేరుకోవాలనే లక్ష్యంతో సిబ్బంది పని చేశారు. దీంతో కూలీల హాజరు శాతం పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అధికారులు పర్యటనలు చేసి పనులకు రాని వారితో సమావేశాలు నిర్వహించారు. గతంలో ఉపాధి కూలీల వేతనాల కోసం రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో పనులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని అధికారులు భావిస్తున్నారు.

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



అక్కెనపల్లి యాదగిరి

పోచమ్మమైదాన్, ఆగస్టు 6: పైడిపెల్లి స్టాలిన్‌నగర్‌లో మంగళవారం సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజు, కార్యదర్శివర్గ సభ్యుడు రొయ్యల రాజు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోల్కొండ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా నగరానికి చెందిన అక్కెనపల్లి యాదగిరి ఎన్నికయ్యారు. స్టాలిన్‌నగర్ గౌరవ అధ్యక్షుడు రవిరాకుల ప్రసంగి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ సిలువేరు సుష్మిత, బిల్డింగ్ కన్స్ట్రక్షన్ జిల్లా కన్వీనర్ జన్ను ప్రవీణ్, యువజన సంఘం జిల్లా నాయకులు జన్ను చిట్టి, బరిగల సుబ్బు, జన్ను అఖిల్, గీసుగొండ మండల కన్వీనర్ పోలెబోయిన శ్రీనివాస్, వరంగల్ మండల కన్వీనర్ పట్టెం మొగిలి, కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి ఎనుగంటి రాజలింగం, పర్వతగిరి మండల కన్వీనర్ ఎస్‌కే పాషా, నర్సంపేట మండల కన్వీనర్ శివకుమార్, వర్ధన్నపేట మండల కన్వీనర్ సత్యం, ట్రాలీ అండ్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా కన్వీనర్ కానుగంటి రాజు, ఆటో జిల్లా కన్వీనర్ గౌస్ పాషా ఎన్నికయ్యారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి జయశంకర్

‘సార్’ జయంతి కార్యక్రమాల్లో వక్తలు

సంగెం, ఆగస్టు 6: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని, అందరికీ ఆయన ఆదర్శంగా నిలిచారని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం జయశంకర్ సార్ జయంతి వేడుకలను రామచంద్రపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సర్ చిత్రపటానికి నివాళులఅర్పించి మాట్లాడుతూ ఆరు దశాబ్దాలపాటు తెలంగాణరాష్ట్ర ఆవశ్యకతను చాటి చెప్పిన మహోన్నత వ్యక్తిగా, సిద్ధాంతకర్తగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారనిన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాసర్ల రవీందర్, ఎంపీవో కొమురయ్య, పల్లె దావఖాన వైద్యుడు క్రాంతి, ఎంపీఎం కిషన్, గిర్దావర్ శారద, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

- వరంగల్‌సిటీ: వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధన స్థానం సమావేశ మందిరంలో సార్ జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథి సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఉమారెడ్డి జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. స్వరాష్ట్ర సాధనకు ఆయన దిక్సూచిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ సెంటర్ అధికారులు, సైంటిస్టులు పాల్గొన్నారు.
- శంభునిపేట : తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని ఉద్యమకారులు కత్తెరపల్లి దామో దర్, యాడాల జగపతిలు అన్నారు. సార్ జయంతి సందర్భంగా మంగళవారం రంగశాయిపేట సాయినగర్ కాలనీలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణ కు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసి మూడు తరాలుగా పోరాటంలో ప్రజలను చైతన్యం చేసిన ఘనత జయశంకర్‌ది అని కొనియాడారు. కార్యక్రమంలో యాడాల జగదీష్, మేకల సూరయ్య, భూంపల్లి జయశంకర్, వంగపల్లి సదానందం, ఇల్లందుల రవి, తేలు రాకేష్, జోరిక సదానం దం, కలకోట్ల క్రాంతి కుమార్, మైదా శేఖర్ పాల్గొన్నారు.
- గీసుగొండ: ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మండలంలో ప్రభుత్వ కార్యాలయాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అశోక్‌రావు, కేజీబీవీలో ఎస్‌వో హిమబిందు, ఆయా పాఠశాలల్లో హెడ్‌మాస్టర్‌లు సాంబయ్య, కమల, సంపత్‌రావు, సత్యనారాయణ, రాజేశ్వరీ, రాంగోపాల్‌రెడ్డి జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.





రాంచంద్రాపురంలో నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్, సాయినగర్‌కాలనీలో నివాళి అర్పిస్తున్న ఉద్యమకారులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమారెడ్డి

ఉద్యమానికి ఆయువుపట్టు గద్దర్

గద్దర్ ఆలోచనా ఐక్యవేదిక కన్వీనర్ నాగరాజు

ఖిలావరంగల్, ఆగస్టు 6: తెలంగాణ ఉద్యమానికి ఆయువుపట్టు ప్రజాయుద్ధనౌక గద్దర్ అని గద్దర్ ఆలోచనా ఐక్యవేదిక కన్వీనర్ సుద్దాల నాగరాజు అన్నారు. మంగళవారం ఖిలా వరంగల్ అమరవీరుల స్థూపం వద్ద గద్దర్ వర్థంతి సందర్భంగా కార్పొరేటర్ బైరబోయిన ఉమా దామోదర్‌యాదవ్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమంలో కోట్లాది మందిని తన ఆటపాటలతో ఉరకలెత్తించారన్నారు. గద్దర్ మన మధ్యలేక పోయినా ఆయన స్వరంమన మదిలో ఎల్లప్పుడూ గింగిర్లు తిరుతూనే ఉంటుందన్నారు. వరంగల్ జిల్లాలో గద్దర్ విగ్రహం, ఆయన పేరిట కళాక్షేత్రం, పాఠ్యపుస్తకాలలో చరిత్రను పొందుపర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మైదం రవి, డైమండ్ బాబు, దాసరి రమేష్, పోశాల సారంగపాణి, మీరిపెల్లి రాజు, పోశాల సురేష్, నలిగంటి రవి, బైరబోయిన నవీన్, రాజు, మైదం బాబు, ఆకులపెల్లి శ్రీనివాస్, గజ్జ చందూ పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

మట్టెవాడ, ఆగస్టు 6: వరంగల్ బట్టల బజార్ శ్రీ బాలానగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం శ్రావణమాస పవిత్రోత్సవాల రెండో రోజున స్వామివారికి పవిత్రాలతో అలంకరించారు. ఉదయం, సాయంత్రం మూలమంత్ర, శ్రీ సూక్త హవనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏలపాటి రత్నాకర్‌రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచర్యులు, పవిత్రోత్సవ సేవాసమితి అధ్యక్షులు గుముడవెల్లి అశోక్, గందె గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

పోచమ్మమైదాన్, ఆగస్టు 6: కేరళ రాష్ట్రంలో వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బుస్స రవీందర్ కోరారు. పోచమ్మమైదాన్ చౌరస్తాలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో బాధితుల కోసం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఖాసీం, తాల్లపల్లి రాయల, మేడిది అశోక్, పరికిరాల రమేష్, బచ్చల స్వప్న, కొయ్యడ మనోహర్, బొల్లి సామల్, ఎంజాద్, లక్ష్మి, మల్లయ్య, వసంత పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

గిర్మాజిపేట, ఆగస్టు 6 : తల్లిపాలే బిడ్డకు సురక్షితమని, తల్లికి కూడా మేలు జరుగుతుందని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రసూతి, స్త్రీ రోగ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ప్రసూతిస్త్రీ రోగ డిపార్టుమెంట్‌లో జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన తల్లిపాల వారోత్సవంలో శిరీష మాట్లాడారు. శిశువు పుట్టిన గంటలోనే తల్లికి ముర్రిపాలు వస్తాయని, వాటిని శిశువుకు పట్టిస్తే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బోధనాస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ పద్మావతి, బాలరోగ విభాగాధిపతి డాక్టర్ కె.అశోక్ కుమార్, జాతీయ ఆయుష్ మిషన్ ఆయుర్వేద బోధనాఆస్పత్రి జాతీయ ఆయురోగ్య మిషన్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రవణ్ పాల్గొన్నారు.



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న శిరీష

CRIME CORNER

యువతి ప్రాణాలు కాపాడిన బ్లూ కోర్ట్స్ పోలీసులు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 6: పురుగుల మందు చేతపట్టుకొని ఆత్మహత్య చేసుకుంటానంటూ తన బావకు వీడియో కాల్ చేసిన ఓ యువతిని మంగళవారం బ్లూ కోర్ట్స్ పోలీసులు కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన ఓ యువతి తనను తన తండ్రి నిత్యం మందలిస్తున్నాడని, జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నానని తన బావకు వీడియో కాల్ చేసి చెప్పింది. ఆందోళనకు గురైన వినయ్ వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చి ఆమె ఉన్న ప్రాంతం వివరాలను తెలిపాడు. దాంతో అప్రమత్తమైన ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని బ్లూ కోర్ట్స్ కానిస్టేబుళ్లు రాజయ్య, శ్రీనివాసు వెంటనే వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో వెతికి యువతిని గుర్తించి.. పోలీస్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. యువతి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లను ఏసీపీ నందిరాం నాయక్ అభినందించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

హెచ్‌ఎం రెండు కాళ్లు నుజ్జునుజ్జు

కరీమాబాద్, ఆగస్టు 8: ఉర్సుగుట్ట బైపాస్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం హన్మకొండ విష్ణుప్రియా గార్డెన్స్ ప్రాంతానికి చెందిన బయ్య విద్యాసాగర్ గుంటూరుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే తన ద్విచక్రవాహనంపై పాఠశాలకు వెళ్లి విధులు ముగించుకొని హన్మకొండకు తిరిగి బయలుదేరాడు. ఉర్సుగుట్ట కాజీపేట బైపాస్ రోడ్డు వద్ద ఓలారీ వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో కిందపడ్డాడు. దీంతో అతడి రెండు కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఎంజీఎంకు తరలించారు. విషయం తెలుసుకున్న విద్యాసాగర్ కుటుంబసభ్యులు ఎంజీఎం చేరుకొని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌తో జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 6: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 23 మంది వాహనదారులకు మంగళవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. 23 మంది వాహనదా రులకు రూ. 36,300 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురు వాహనదా రులకు రూ.4,500 జరిమానా విధించారన్నారు.

ఫెన్సింగ్ కనీల ధ్వంసం

గీసుగొండ, ఆగస్టు 6: మండలంలోని విశ్వనాథపురం రెవెన్యూ గ్రామ పరిధిలో వ్యవసాయ భూమికి ఫెన్సింగ్ చేయటానికి తీసుకువచ్చిన కనీలను ధ్వంసం చేసినట్లు కొమ్మాల గ్రామానికి చెందిన కన్నెబోయిన ప్రవీణ్, నాగరాజులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొమ్మాల గ్రామానికి చెందిన బట్టమేకల రాజయ్య అతని కుమారులు కనీలను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి పట్టివేత



ఘటన వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లయ్య

కరీమాబాద్, ఆగస్టు 6: గంజాయి తరలిస్తున్న వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు మిల్స్ కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం చింతల్ బ్రిడ్జి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పరిశీలించగా రూ.2.10 లక్షల విలువైన 8.400 కేజీల గంజాయి లభించింది. నిందితుడిని విచారించగా అతను ముంబాయిలోని థానే పరిధిలోని జీవన్ బాగ్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ బాసిర్‌గా గుర్తించి అతని నుంచి మరిన్ని వివరాలు సేకరించారు.

గంజాయి సరఫరా చేసే మరో ఇద్దరు తప్పించుకున్నారు. తప్పించుకున్న వారిలో ఓల్డ్ ముంబాయి ప్రాంతానికి చెందిన అల్బాస్ బేగ్, ఎస్‌కే నసీమ్ మహమ్మద్ ఉన్నారు. ఇమ్రాన్ బాసిర్ పై కేసు నమోదు చేశారు.

ఎరువుల షాపుపై దాడులు

సంగెం, ఆగస్టు 6: లోహితలో ఎరువులు, పురుగుల మందు షాపులపై వ్యవసాయాధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. సంగెం వ్యవసాయాధికారి యాకయ్య, ఎస్సై నరేష్‌ల కథనం ప్రకారం. అనుమతి లేకుండా క్రిమిసంహారక మందులు, ఎరువులు విక్రయిస్తున్నారన్న సమాచారంతో మూడు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నాగినేని రామకృష్ణారావు లైసెన్సు లేకుండా నిల్వ చేసిన సుమారు రూ.2.12లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. దొమ్మటి రవీందర్ ఇంటి వద్ద అనుమతి లేకుండా రూ.26,650 విలువైన వంద బస్తాల ఎరువుల బస్తాలతో లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. రవీందర్‌కు రాంచంద్రాపురం గ్రామంలో ప్రభుత్వ అనుమతితో ఎరువుల దుకాణం ఉన్నా ట్రాక్టర్‌ను లోహితలో నిలుపడంతో స్వాధీనం చేసుకున్నారు. దుకాణంలో అక్రమంగా 2350 బస్తాల మక్కజొన్నలు నిల్వను గుర్తించి మార్క్‌ఫెడ్ అధికా రులకు సమాచారమిచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 6: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కేంద్రం సంఘం కార్యాలయంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీఎన్‌జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్ ఆధ్వర్యంలో జగదీశ్వర్‌ను సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, సహ అధ్యక్షులు హేమనాయక్, ఉపాధ్యక్షులు దుర్గారావు, వంశీధర్‌బాబు, జిల్లా నాయకులు శ్రీనివాస్, చిరంజీవి, కుమారస్వామి, భరత్ పాల్గొన్నారు.

నైపుణ్యాలతో లాభాలు

శంభునిపేట, ఆగస్టు 6: పాల ఉత్పత్తుల్లో నైపుణ్యాలు పెంచుకుంటే లాభాలు వస్తాయని కృషి విజ్ఞానకేంద్రం (కేవీకే) ప్రధానశాస్త్రవేత్త ఎస్.రాజన్న అన్నారు. మామునూరులోని కేవీకేలో పాల విలువ ఆధారిత ఉత్పత్తులపై మంగళవారం అవగాహన సదస్సులో రాజన్న మాట్లాడుతూ.. పాలఉత్పత్తిలో ప్రపంచంలోనే దేశం ప్రథమ స్థానంలో ఉందన్నారు. పాల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి మార్కెట్ చేయాలన్నారు. ముఖ్యంగా కోవా, కలాకంద్, పన్నీరు, రసగుల్లా లాంటివి రైతుల స్థాయిలోనే తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, శశాంక్, సాయికిరణ్, గణేష్, రైతులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

వరంగల్ సిటీ, ఆగస్టు 6:కాశిబుగ్గలో మంగళవారం త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాత ఆధ్యాత్మిక గ్రంథం, హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. సదా నిరంజన్ మాట్లాడుతూ.. దేవుడే ఒక మనిషిగా జన్మిస్తే అయనను భగవంతుడంటారన్నారు. అలాంటి భగవంతుడు శ్రీ కృష్ణుడు మాత్రమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేవతి, వెంకట్, సాకేత్, శివ, రాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

శంభునిపేట, ఆగస్టు 6 : నక్కలపల్లి, నల్లకుంట ప్రాంతానికి చెందిన దున్నాల మధురాబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మంగళవారం నక్కలపల్లిలో మధురాబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కర్నె రవీందర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, తాబేటి వెంకట్ గౌడ్, మంద శ్రీనివాస్, బోరిగం నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛదనం- పచ్చదనం

సంగెం, ఆగస్టు 6: ప్రతీ ఒక్కరు విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి కోరారు. మంగళవారం రాంచంద్రాపురంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గ్రామంలో పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, అవి ఎదిగేలా చూడాలన్నారు. వ్యాధులు దరిచేరకుండా పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాసర్ల రవీందర్, ఎంపీవో కొమురయ్య, పల్లె దవాఖాన వైద్యుడు క్రాంతి, ఎంపీఎం కిషన్, గిర్దావర్ శారద, పంచాయతీ కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

- ఆటోనగర్: ప్రజలు మలేరియా వ్యాధుల నుంచి జాగ్రత్త పడాలని 21వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ ఫుర్ఖాన్ సూచించారు. కాశిబుగ్గ, పోచమ్మమైదాన్ ప్రాంతాల్లో కార్పొరేటర్ స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నా డివిజన్ -నా గౌరవం నినాదంతో కార్యక్రమం సాగిందన్నారు. ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.
- శంభునిపేట: పచ్చదనం, పరిశుభ్రతలో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుకుంటామని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశుభ్రత, పచ్చదనంపై ప్రజలకు అవగాహనకల్పించారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, శంభునిపేట ప్రభుత్వ పాఠశాల, వాటర్ ట్యాంకు, ఇతర ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేపించారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. వాటర్ ట్యాంకును కడిగించారు.
- ఖిలావరంగల్: తాగునీటి వాడకంపై ప్రజలు అవగాహన కలిగిఉండాలని కార్పొరేటర్లు వస్కుల బాబు, దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, వెల్పుగొండ సువర్ణసురేష్, బైరబోయిన ఉమాదామోదర్‌యాదవ్‌లు అన్నారు. మంగళవారం 18, 34, 35, 37, 38 డివిజన్లలో స్వచ్ఛదనం-పచ్చదనం చేపట్టారు. కార్యక్రమంలో ఖిలావరంగల్ అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్ నరేష్, స్పెషల్ ఆఫీసర్ నిరంజన్, మౌనిక కాంగ్రెస్ నాయకులు బొయిని దూడయ్య, నలిగంటి బెబ్బులి, బెడిద వీరన్న, సంగరబోయిన చందర్, ముఖబీర్, రబ్బాని, అర్షం రాంబాబు, ఫారజ్, సారంగపాణి పాల్గొన్నారు.





21వ డివిజన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ ఫుర్ఖాన్, గుండు చెరువు వద్ద నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సువర్ణసురేష్



సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయండి

నర్సంపేట టౌన్, ఆగస్టు 6: కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్లను బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మునిసిపల్ చైర్మన్ నాగెల్లి వెంకటనారాయణగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. పార్టీలకతీతంగా బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు సత్యాగ్రహదీక్షకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు శానబోయిన రాజ్‌కుమార్, మచ్చిక రాజుగౌడ్, మండల శ్రీనివాస్, బాల్నే సుభాష్, సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవు

చెన్నారావుపేట, ఆగస్టు 6: గుడుంబా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కోనాపురంలో గుడుంబా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలల్లో గుడుంబా విక్రయిస్తే సమాచారం అందించాలన్నారు. నాటు సారాను అరికట్టడంతో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆర్ రాజన్న, హెడ్ కానిస్టేబుల్ ఎండీ రంజిత్, స్వర్ణలత, నాగరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు సహా వివాహిత అదృశ్యం

చెన్నారావుపేట, ఆగస్టు 6: పిల్లలతో సహా ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జల్లి తండాకు చెందిన కొర్ర సునిత (32) యాకూబ్ దంపతులకు అమ్మాయి బిందు(13), అబ్బాయి కిరణ్ (11) ఉన్నారు. యాకూబ్ భార్యను నిత్యం మద్యం సేవించి ఇబ్బందులకు గురిచేస్తుండేవాడు. ఈ క్రమంలో సునిత గత నెల 31న ఇంట్లో నుంచి పిల్లలను వెంట తీసుకుని ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సునిత సోదరుడు గుగులోతు వీరాస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



అదృశ్యమైన సునిత, బిందు చిత్రం

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, ఆగస్టు 6: మండలంలోని మగ్దుంపురంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన కొమ్మ శివ అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఇంటి ఆవరణలో నిల్వ చేశాడని అందిన సమాచారం పోలీసులు గ్రామానికి చేరుకుని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఇంట్లో నిల్వ చేసిన 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

చెన్నారావుపేట, ఆగస్టు 6: మండలంలోని కోనాపురం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎడ్ల నారాయణరెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థంగా విద్యార్థులందరికీ మంగళవారం ఉచితంగా టై, బెల్టులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రవిందర్, పాఠశాల చైర్మన్ వట్టిపెల్లి రమ, చిరంజీవి, ఎడ్ల మధుసుదన్‌రెడ్డి, రవిందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

చెన్నారావుపేట, ఆగస్టు 6: మండలంలోని పాతమగ్దుంపురం గ్రామానికి చెందిన పోలేపల్లి కళ ఇటీవల అనారోగ్యానికి గురికాగా వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి చొరువతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు స్థానిక కాంగ్రెస్ నాయకులు రూ. 26 వేలను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ననుమాస వీరాస్వామి, మాజీ ఉప సర్పంచ్ ననుమాస కర్ణాకర్‌గౌడ్, భిక్షపతి, శంకేషి రంజిత్, మంచిక సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు

పర్వతగిరి, ఆగస్టు 6: నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై భోగం ప్రవీణ్‌ను మంగళవారం ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మెపా జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల రాజు, పర్వతగిరి ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు కొండా వెంకన్న, కార్యదర్శి రావుల రాజు, డైరెక్టర్ మొగిలి శ్రీనివాస్, తోట రాజు, గుర్రం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్ సార్ జయంతి

పర్వతగిరి, ఆగస్టు 6: జయశంకర్ సార్ జయంతి వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో రాంరెడ్డి జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, డీసీవో సంజీవరెడ్డి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, ఈసీ రాజు, సూపరింటెండెంట్ రూపేష్, కార్యదర్శి రఘు తదితరులు పాల్గొన్నారు.

● నర్సంపేట: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, ఎన్ఆర్ఐ రాజ్‌కుమార్, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గంప రాజేశ్వర్, మండల శ్రీనివాస్, బండిరమేశ్, రవి, ప్రభాకర్‌రెడ్డి, సాంబయ్య, గందెచంద్రమౌళి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

● నర్సంపేట టౌన్: విద్యార్థులు ప్రొఫెసర్ జయశంకర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బైరి సత్యనారాయణ, డాక్టర్ కందాల సత్యనారాయణ, రహీమొద్దీన్, సోమయ్య, రాజీరు తదితరులు పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ రాజేష్ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● ఖానాపురం: ఆచార్య జయశంకర్ జయంతిని మండల వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో సునీల్ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుప్రజ, షపీర్, ముడుసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, మల్లంపల్లి ఉన్నత పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎలగొండ రామస్వామి, భద్రమ్మ, ఉపాధ్యాయులు అహ్మద్, దేవేందర్, సుశీల, మహేశ్ పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీవాణి, సిద్దార్థ హైస్కూల్‌లో సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డిలు జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీవో అరుణ, హెచ్‌ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, మేడీ రమేష్‌గౌడ్, జగదీశ్వర్, వేణు, గణేష్, ఎంపీవో శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ: నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, ఎస్సై మహేందర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ అతిథి గృహంలో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కార్యాలయాల్లో జయశంకర్ జయంతిని నిర్వహించారు .

● రాయపర్తి: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామపార్టీ అధ్యక్షుడు మచ్చ రమేష్, నాయకులు గబ్బెట బాబు, బొమ్మెర కళ్యాణ్, రాజయ్య, ప్రవీణ్, పవన్, కొమురయ్యలు ఆచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, జిల్లానాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావులు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● వర్ధన్నపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మునిసిపాలిటీ, వర్ధన్నపేట జెడ్పీహెచ్ఎస్‌లలో జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, కమిషనర్ జోనా, ఎంపీడీవో వెంకటరమణలు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా సాగుతున్న ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి ఆయా కార్యాలయాల్లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీవో ధనలక్ష్మి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రమణారావు, జానకిదేవి, మున్సిపాలిటీ సిబ్బంది శ్రవణ్‌కుమార్, కిరణ్, శ్రీదేవి, ఐలయ్య, శంకర్, ఉపాధ్యాయులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పర్వతగిరిలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జడ్పీ సీఈవో

విద్యార్థుల చేతుల్లోనే పల్లెల పచ్చదనం

వరంగల్ కలెక్టర్ సత్య శారద

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 6 : పల్లెల్లో పచ్చదనం పెంచాలన్నా, గ్రామాల్లో స్వచ్ఛదనం మెరవాలన్న విద్యార్థుల చేతుల్లోనే ఉందని కలెక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం మండలంలోని ఇల్లంద ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం రెండో రోజు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి గ్రామంలోని పలు పురవీధులలో తిరిగి పరిశీలించారు. అంతకు ముందు ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు విజయవంతం చేయాలన్నారు. ఈనెల 9 వరకు జరిగే కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని సూచించారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను ప్రజలు గ్రహించి వాడకాన్ని తగ్గించాలని కోరారు. విద్యార్థులకు వీటిపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, వారికి బహుమతులు అందించాలని సూచించారు. గ్రామాల్లో గ్రీనరీని పెంచే విధంగా కృషి చేయాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. పల్లె రూపురేఖలు సమూలంగా మార్చే ఉద్దేశంతో పల్లెల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకట్రామరెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇజ్జగిరి, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో ధనలక్ష్మి, తహసీల్దార్ విజయ్ సాగర్, కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.



ఇల్లందలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన బండా ప్రకాష్

పర్వతగిరి, ఆగస్టు 6:మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన హేమ సుభాషిణికి రూ.48 వేల విలువగల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ మంగళవారం అందించారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ మహాసభ యువత ప్రధానకార్యదర్శి గుండా రాకేష్‌ముదిరాజ్, అన్నం మహేష్ పాల్గొన్నారు.

పదోన్నతులు ఇప్పించిన ఘనత పీఆర్టీయూదే..

నెక్కొండ, ఆగస్టు 6: ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులను ఇప్పించిన ఘనత పీఆర్టీయూ సంఘానిదేనని మండల విద్యాశాఖాధికారి వి. రత్నమాల, మండల పీఆర్టీయూ అధ్యక్ష కార్యదర్శులు మాలోతు ప్రతాప్‌సింగ్, కర్ర యాకుబ్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం నెక్కొండలోని ఎమ్మార్సీ భవనంలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై అనేక రకాలుగా అలుపెరగని ఉద్యమాలను చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసేది ఒక్క పీఆర్టీయూనే అనే విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తించి సభ్యులుగా చేరాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌నాథ్, ఐలయ్య, బానోతు భిక్షపతి, హెచ్‌ఎంలు రంగారావు, శ్రావణ్ కుమార్, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, రజిత, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చీని నిమ్మ సాగుతో అధిక లాభాలు

వర్ధన్నపేట, ఆగస్టు 6: చీనినిమ్మసాగుతో రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని మండల వ్యవసాయ అధికారి సాగరిక అన్నారు. వర్ధన్నపేట కేంద్రంలోని రైతువేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆమె హాజరై వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు తోటలసాగుపై అందించిన సలహాలు, సూచనలు వివరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు చీని నిమ్మ సాగు చేసే రైతులకు ఉపాధిహామీ ద్వారా చేయూతనందిస్తుందన్నారు. ఒక ఎకరంలో 120 వరకు మొక్కలు నాటుకోవచ్చునని సాధారణ దేశావళి రకం ఏడాదికి రెండుసార్లు దిగుబడి వస్తుందని ప్రస్తుతం చీని నిమ్మకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారితో రాణా ప్రతాప్‌రెడ్డి

స్థానిక ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

నర్సంపేట, ఆగస్టు 6: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఉంటుందని బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మండలపార్టీ అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గార్లగడ్డతండాకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆంగోతు వీరన్న, మూడ్‌నవీన్. సుబ్బు, బానోతు వీరునాయక్, అజ్మీర సంతోష్, శ్రీకాంత్, రాజు, అన్వేష్, రవి పార్టీలో చేరగా వారికి రాణా కాషాయంకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని దానాల కంటే రక్తదానం గొప్పది

నర్సంపేట, ఆగస్టు 6: అన్ని దానాల కంటే రక్తదానం ఎంతో గొప్పదని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణఅధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని సిటిజన్‌క్లబ్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనెఎ యువరాజ్, పట్టణ యూత్ అధ్యక్షుడు రాయిడిదుశ్యంత్‌రెడ్డి మరికొంత మంది రక్తదానం చేశారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, మండల శ్రీనివాస్, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, గంపరాజేశ్వర్, బండిరమేశ్, రవి, గందె చంద్రమౌళి, ఇర్ఫాన్, సాంబయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఖానాపురం: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోరె సుధాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బూస రమఅశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి: మండలంలోని గిర్నిబావిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మాజీ జడ్పీవైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, కాట్ల భద్రయ్య. గుండెకారి రంగరావు, తిరుపతి, జనార్దన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చింత యాగేందర్, కంచరకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, వంగేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాటిన మొక్కలను సంరక్షించాలి

నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్

దుగ్గొండి, ఆగస్టు6: నాటిన మొక్కలు పెరిగేలా చూడాలని, వాటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో మంగళవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఆవరణలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదర్శవాణి ఉన్నత పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మొక్కలు పెంపకం ఉపయోగపడుతుందన్నారు. వాతావరణ కాలుష్యం నివారణకు దోహదపడుతాయన్నారు. ఈకార్యక్రమంలో సీఐ రాజగోపాల్‌గౌడ్, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది, అంగన్‌వాటీ టీచర్లు, ఆదర్శవాణి విద్యాలయం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నెక్కొండ: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని నెక్కొండ సీఐ చంద్రమోహన్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం నెక్కొండ పోలీస్ స్టేషన్ అవరణతో పాటు పరిసరాల్లోని వీధులను పోలీసు సిబ్బంది శుభ్రం చేశారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● రాయపర్తి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రతీ ఒక్కరు నడుం బిగించాలని వరంగల్ జడ్పీ సీఈవో రామిరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తూరులో స్వచ్ఛదనం-పచ్చదనం రెండో రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా చర్చి ఎదుట మొక్క ను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిషన్, ఎంపీవో కూచన ప్రకాష్, ఎంఈవో నోముల రంగయ్య, కార్యదర్శి అస్మా తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి: మండలకేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీ సీఈవో రాంరెడ్డి మొక్కలు నాటారు. అనంతరం పోలుకమ్మ చెరువు వద్ద జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, డీసీవో సంజీవరెడ్డి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, హెచ్‌ఎం పాక రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



దుగ్గొండి పోలీసు స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఏసీపీ

జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన 'గోకా'

నర్సంపేట టౌన్, ఆగస్టు 6: నర్సంపేట పట్టణానికి చెందిన వనప్రేమికుడు గోకా రామస్వామి తన 70వ పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ఆయనకు చెందిన శాంతివనంలో 70 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులచే స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు 70 మీటర్ల గ్రీన్‌ఫ్లాగ్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ పుట్టిన రోజున మొక్కలు నాటి ప్రకృతిని పచ్చదనంగా మార్చాలన్నారు. గోకా రామస్వామిని ఆదర్శంగా తీసుకొని మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోకా లీలావతి ట్రస్టు నిర్వాహకుడు గోకా వినోద్, స్వప్న, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గిరగాని సుదర్శన్‌గౌడ్, బెజ్జంకి ప్రభాకర్, కోట డేవిడ్, కాసుల రవికుమార్, రాము, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై అనుమానాలు!

(5వ పేజీ తరువాయి)

బృందాల తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూస్తే ఉపాధి పనులకు నిధుల మంజూరులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒత్తిడితోనే..

ఈ ఏడాది ఉపాధి పనులను లక్ష్యానికి అనుగుణంగా చేపట్టాలని సిబ్బందిని పురమాయించడంతో పాటు గతానికంటే భిన్నంగా రోజు వారీ ప్రగతిపై సమీక్షించడం వల్లే కూలీల హాజరు సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర బృందాల తనిఖీల్లో వాస్తవాలు వెలుగు చూడనున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయాల్లో పనులు, కూలీలు, పని దినాలకు సంబంధించిన రికార్డులను తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఈ వేసవిలో కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు వెతుక్కునే అవకాశం లేకుండా స్థానికంగానే ఉపాధి పథకం కింద పనులు చూపిస్తామని అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతో కూలీల సంఖ్య పెరిగింది. ఉపాధి కూలీ రూ.270 నుంచి రూ.300 పెరగడంతో అధిక సంఖ్యలో పనులు చేసేందుకు కూలీలు ముందుకు వస్తున్నారనేది మరో కారణం. క్షేత్ర స్థాయిలో వారానికి ఒక రోజు పనులు పరిశీలించడంతో పాటు, కూలీల హాజరు తక్కువగా ఉన్న చోట పెంచే విధంగా అవగాహన కల్పించారు. వార్షిక ఉపాధి ప్రణాళికలో రూపొందించిన పనుల దినాల్లో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 70 శాతానికి చేరుకోవాలనే లక్ష్యంతో సిబ్బంది పని చేశారు. దీంతో కూలీల హాజరు శాతం పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అధికారులు పర్యటనలు చేసి పనులకు రాని వారితో సమావేశాలు నిర్వహించారు. గతంలో ఉపాధి కూలీల వేతనాల కోసం రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సకాలంలో వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో పనులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.